

సామాజిక న్యాయం పాటించాలి
ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.
- 8లో



చేనేత రంగం కీలకం
దేశ ఆర్థిక పరిపుష్టిలో చేనేత రంగం కీలకమని నేషనల్ డిఫెన్స్ అకాడమీ మేజర్ జర్నల్‌తో పాటు ఐఏఎస్ అధికారి అన్నారు.
- 8లో



న్యూస్‌రీల్

ముగిసిన బార్ అసోసియేషన్ నామినేషన్లు



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నామినేషన్ వేస్తున్న జటంగి వెంకటేశ్వర్లు యాదవ్

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. ఈనెల 28న ఎన్నికలు జరగనున్నాయి. వివిధ పదవులకు గాను న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు. అసోసియేషన్ అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పదవికి మారపాక వెంకన్న, డపుకు మల్లయ్య, ఉపాధ్యక్ష పదవికి ఎంవీఎస్ వరప్రసాద్‌రావు, గుంటూరు మధు, తొగట్టి మురళి, జాయింట్ సెక్రటరి పదవికి రాచకొండ యాదగిరి, మామిడి మట్టయ్య, దావుల చిన్న వీర ప్రసాద్, పెండెం వాణి, కోశాధికారికి ధరావతు వీరేష్ నాయక్, లైబ్రరీకి ఎండీ అబ్దుల్ లతీఫ్, పల్లెటి రాముడు, గేమ్స్ అండ్ కల్చరల్‌కు జిలకర చంద్రమౌళి, గుడుంగుంట్ల ప్రకాశ్, ఈసీ సభ్యులుగా కొరిపెల్లి వెంకటేశ్వర్లు, డి.వెంకట్ రెడ్డి, సుంకర రవి, జిలకర చంద్రమౌళి నామినేషన్లు దాఖలు చేశారు. కోశాధికారి పదవికి తప్ప మిగిలిన అన్నింటికి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తిగట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ ,ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లిలక్ష్మణాచార్యులు,పద్మ నాభాచార్యులు, బదరీ నారాయణా చార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

భువనగిరి సీపీఎం అభ్యర్థిగా జహంగీర్




ఎండీ జహంగీర్

భువనగిరిటౌన్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సీపీఎం అభ్యర్థిగా ఆ పార్టీ యాదాద్రి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్‌ను రాష్ట్ర కమిటీ బుధవారం ప్రకటించింది. ఆయన స్వగ్రామం రామన్నపేట మండలం మునిపంపుల. మహబూబ్ అలీ, బీజన్‌బీ దంపతులకు 1970లో జన్మించారు. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన జహంగీర్.. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఇతర ప్రజాసంఘాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. వామపక్ష భావజాలంతో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. తండ్రి మహబూబ్ అలీ కూడా వామపక్షవాది. వామపక్ష ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. మునిపంపుల సర్పంచ్‌గా పని చేశారు.

కాన్పుకెళ్తే కోతలే..!

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రసవాలు
- ఆపరేషన్లు చేయడానికే మొగ్గు చూపుతున్న వైద్యులు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
- పట్టించుకోని వైద్యారోగ్యశాఖ



సూర్యాపేట: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనివ్వడానికి ఆరాట పడే తల్లులకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోతలు తప్పడంలేదు. మాతా శిశు ఆరోగ్యానికి సాధారణ ప్రసవాలే ఎంతో మేలని ప్రభుత్వం చెబుతున్నా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి. సుఖప్రసవానికి అవకాశం ఉన్నా కాసుల కోసం ఆపరేషన్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎడాపెడా సిజేరియన్లు చేసి లక్షలు దండుకుంటున్నారు. జిల్లాలో పది నెలల కాలంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో 3,890 సిజేరియన్లు జరిగాయి. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి ప్రైవేట్ క్లినిక్‌లను సందర్శించి ఆపరేషన్ ద్వారా కాన్పు ఎందుకు చేయాల్సి వచ్చిందో పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వ దవాఖానాల్లోనే సాధారణ ప్రసవాలు అధికం..

జిల్లా వ్యాప్తంగా ప్రసవాలు చేసే ప్రైవేట్ ఆస్పత్రులు 70వరకు ఉన్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు తరచూ వైద్యులతో సమావేశాలు నిర్వహించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశిస్తున్నారు. ప్రైవేట్ క్లినిక్‌లపై పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల (ప్రోగ్రాం ఆఫీసర్ల)ను నియమించారు. వీరు గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా, ఇక్కడే ప్రసవాలు చేసుకునేలా చూడాల్సి ఉంది. కానీ ఎవరూ ఆ పని చేయడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతినెలా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను సందర్శించి వాటిలో ఎన్ని సాధారణ కాన్పులు, ఎన్ని సిజేరియన్లు జరిగాయన్న వివరాలు సేకరించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఆపరేషన్లు చేసిన ప్రైవేట్ వైద్యులు, క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి. అయితే ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

గత ఏడాది ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకు ప్రసవాలు

ఆస్పత్రులు	సాధారణం	ఆపరేషన్లు
ప్రైవేట్	897	3,890
ప్రభుత్వ	5,439	2,972

చర్యలు తీసుకుంటాం..



“రిస్క్, హైరిస్క్ ఉన్న సందర్భాల్లో మాత్రమే ఆపరేషన్ ద్వారా కాన్పులు చేయాలి. డబ్బు కోసం సాధారణ ప్రసవాలకు కూడా ఆపరేషన్ చేయొద్దు. ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నాం. నిబంధనలు పాటించని ఆస్పత్రులు, వైద్యులపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి, సూర్యాపేట

ముహూర్తం కోసం..

సాధారణంగా నెలలు నిండి, నొప్పులు వచ్చిన సమయంలోనే ప్రసవం చేస్తుంటారు. కానీ కొంత మంది కుటుంబ సభ్యులు తిథి, నక్షత్రం చూసుకొని ఈ సమయంలో పిల్లలు పుడితే మంచిదని భావిస్తున్నారు. నిర్ణయించిన సమయంలో ఆపరేషన్ చేయాలని వైద్యులకు సూచిస్తున్నారు. ఈ కారణంగానే ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు అధికంగా జరుగుతున్నట్లు ఒకపక్క చెబుతుండగా మరోపక్క మాత్రం చాలా చోట్ల డబ్బు సంపాదనే ధ్యేయంగా సీరియస్‌గా ఉందని చెప్పి సిజేరియన్లు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో హైరిస్క్ ఉన్న వారికే ఆపరేషన్ ద్వారా కాన్పులు చేస్తున్నారు.

తిరుమలగిరిలో నెగ్గిన అవిశ్వాసం



తిరుమలగిరి మున్సిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు, ఎమ్మెల్యే సామేల్

- మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన కౌన్సిలర్లు
- అనుకూలంగా చేతులెత్తిన 13 మంది సభ్యులు
- ముగ్గురు సభ్యులు గైర్హాజర్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు సమక్షంలో ఓటింగ్ నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో 15 మంది కౌన్సిలర్లు ఉండగా 12 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడైన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరయ్యారు. మొత్తం 13 మంది సభ్యులు చేతులెత్తి అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు.

మారిన సమీకరణలు

మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న తిరుమలగిరి.. మాలిపురం, నందాపురం, అనంతారం గ్రామాలతో కలిపి నూతన మున్సిపాలిటీగా 2018 ఆగస్టు 2న ఏర్పాటైంది. 2020లో మున్సిపల్‌ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి 11 మంది, కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు గెలుపొందారు. 2020జనవరి 27న కొత్త పాలకవర్గం కొలువుదీరింది. చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన రజని, వైస్ చైర్మన్‌గా రఘునందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆతర్వాత 2వ వార్డు కౌన్సిలర్ సి.హెచ్.హన్మంతు బీజేపీలో చేరారు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన 7వ వార్డు కౌన్సిలర్ సరళాయాదవరెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ గిలకత్తుల ప్రియలతారాముగౌడ్, 4వ వార్డు కౌన్సిలర్ బత్తుల శ్రీను కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారారు. రెండు రోజుల క్రితం కూడా మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యేను కలిసి క్యాంపునకు వెళ్లినట్లు తెలిసింది.



అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రకటిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

హాజరుకాని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

మున్సిపాల్టిలో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ సంకెపల్లి జ్యోతి హాజరు కాలేదు. అవిశ్వాసం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వేణుమాధవరావు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని, త్వరలోనే తేదీలను ప్రకటించినట్లు తెలిపారు.

ప్రస్తుతం వీరి బలం 12కు చేరింది. వీరితో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా స్థానిక శాసన సభ్యుడికి కూడా ఓటు హక్కు ఉంటుంది. దీంతో వీరి బలం 13కు చేరింది.

ఉత్కంఠకు తెర

అవిశ్వాస తీర్మానంపై గత నెల 26వ తేదీన పది మంది కౌన్సిలర్లు సంతకం చేసి కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కౌన్సిలర్లు 20 రోజులుగా క్యాంపులో ఉండి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సమావేశంలో పాల్గొన్నారు. అవిశ్వాసం నెగ్గడంతో ఇప్పుడు అందరి దృష్టి నూతన చైర్మన్‌పై పడింది. ఎవరిని చైర్మన్, వైస్ చైర్మన్‌గా నియమిస్తారన్న చర్చ మొదలయింది.

పోలీస్ బందోబస్తు

అవిశ్వాసం సందర్భంగా పోలీసులు 144 సెక్షన్ అమలులో ఉంచారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలతో పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.

మద్దతు తెలిపిన సభ్యులు వీరే..

అవిశ్వాస సమావేశానికి 13మంది సభ్యులు హాజరయ్యారు. వీరిలో 1వ వార్డు సభ్యుడు భాస్కర్, 2వ వార్డు సభ్యుడు హనుమంతు, 4వ వార్డు సభ్యుడు బత్తుల శ్రీను, 6వ వార్డు సభ్యురాలు శ్రీలత, 7వ వార్డు సభ్యురాలు సరళ, 8వ వార్డు సభ్యురాలు అనసూయ, 9వ వార్డు సభ్యురాలు కన్నెబోయిన రేణుక, 10వ వార్డు సభ్యుడు ఎం.జితేందర్, 11వ వార్డు సభ్యుడు వై.నరేష్, 13వ వార్డు సభ్యురాలు పత్తెపురం సరిత, 14వ వార్డు సభ్యుడు పొన్న రాజ్యలక్ష్మి, 15వ వార్డు సభ్యురాలు గిలకత్తుల ప్రియలతతో పాటు ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు.

ఇంటి నుంచే ఓటు

- వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- ఏప్రిల్ 22 వరకు దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ : వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. 85 సంవత్సరాలు పైబడినవారు, దివ్యాంగులు.. ఎవరైతే పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేందుకు అవకాశం లేదో వారు తమ ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు ఉంది. అందుకోసం ఏప్రిల్ 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది.

బీఎల్ఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో..

నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో 85 ఏళ్ల పైబడిన ఓటర్లు 11,883 మంది ఉండగా.. దివ్యాంగులు 46,406 మంది ఉన్నారు. వారి నుంచి ఎన్నికల అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారు. తహసీల్దార్ కార్యాలయాలు, బీఎల్ఓల వద్ద దరఖాస్తులను సిద్ధంగా ఉంచారు. ఆధార్, ఎపిక్ కార్డు నంబర్లతో దరఖాస్తును బీఎల్ఓలకు లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తు ఆధారంగా సదరు వ్యక్తి ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు అర్హుడా కదా అనే విషయాన్ని పరిశీలిస్తారు. అర్హత ఉంటే అతడికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

హోం ఓటింగ్ ఇలా..

పోలింగ్‌కు ముందుగానే దరఖాస్తుదారుల ఇళ్లకు రెవెన్యూ, పోలింగ్, పోలీస్ సిబ్బంది వెళ్లి ఇంటి వద్దనే వారు ఓటు వేసే విధంగా అవకాశం కల్పిస్తారు. బ్యాలెట్ పేపర్‌తో పాటు పోలింగ్ బాక్సును వెంట తీసుకెళ్లి అక్కడ సదరు వ్యక్తి ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ బాక్సును అతని ముందుంచుతారు. బ్యాలెట్ పేపర్‌ను ఆ బాక్స్‌లో ఓటరే స్వయంగా వేస్తారు. సిబ్బంది ఆ బాక్స్‌ను ఆర్ఓ కార్యాలయంలో భద్రపరుస్తారు. కౌంటింగ్ రోజున ఆ బాక్స్ తెరుస్తారు.

ఎన్నికల్లో మీడియా సహకారం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు, చిత్రంలోఅదనపు కలెక్టర్ లత, ఎస్పీ రాహుల్‌హెగ్డే

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించడానికి మీడియా సహకారం అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు అన్నారు. పార్లమెంటు ఎన్నికలనేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను బుధవారం ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలసి ఆయన ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసీఎంసీ పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర రావు, డీపీఆర్ఓ రమేష్ కుమార్, డీఐఈఓ మల్లేశం, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

అటవీ భూముల హద్దులు ఏర్పాటు చేయాలి

అటవీ భూముల హద్దులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అటవీ పరిరక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. చింతలపాలెం మండలంలో ఉన్న అటవీ భూములను గుర్తించి వాటికి సరిహద్దులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ,అదనపు కలెక్టర్ బీఎస్ లత, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీటీడబ్ల్యూఓ శంకర్, ఆర్డీఓ సురేష్‌రెడ్డి, జిల్లా మైనింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలి

చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలని జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకటరావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఇంటలీజెన్స్ కమిటీ సమావేశంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే , అదనపు కలెక్టర్ బీఎస్. లత, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, ఎక్సైజ్ పర్యవేక్షకుడు లక్ష్మనాయక్, డీఎఫ్ఓ సతీష్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ పాల్గొన్నారు.

నేడు అశోక్‌తేజ రాక

భానుపురి (సూర్యాపేట): మనం వికాస వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సూర్యాపేట పట్టణంలోని బాలాజీ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించనున్న 'సుద్దాల అశోక్‌తేజతో ఓ సాయంత్రం' కార్యక్రమానికి ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరుకానున్నట్లు మనం వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమవుతుందని, సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి సోమనరసయ్య, ప్రముఖ కవి ప్రసేన్ హాజరుకానున్నట్లు వివరించారు.

ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఉపాధి కూలీలకు బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ అనుసంధానం సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్. వెంకటరావు ఆదేశించారు. బుధవారం కలెక్టర్‌లోని తన చాంబర్‌లో డీఆర్‌డీఏ, పోస్టల్ అ ధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్ట ర్ మాట్లాడారు. జిల్లాలో 8,925 మంది ఉపాధి కూలీల బ్యాంకు అకౌంట్లకు ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ జి. మధుసూదన రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాంస్కృతిక కార్యక్రమాలు

యాదగిరిగుట్ట: యాదాద్రిలో నిర్వహిస్తున్న ధార్మిక, సాహిత్య, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు వీరప్రతాప భజన మండలి, శ్రీపాండురంగ భజన మండలి, శ్రీ గాయత్రి మహిళ భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి. శ్రీలక్ష్మీనారాయణ భగవతార్ తిరుమంగయాళ్వార్ చరిత్ర హరికథ గానం వినిపించారు. సాయంత్రం ఎస్.నాగజ్యోతి, కొటూరి గాయత్రిలచే భక్తి సంగీతం, తోరణాల పద్మజచే కర్ణాటక సంగీతం, కుమారి మాహ్నితచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. శోభరాజు సంగీత కచేరి నిర్వహించారు. జ్వాలాముఖిచే కూచిపూడి నృత్యం, రిషి డ్యాన్స్ అకాడమీచే పేరణి నృత్యం జరిపించారు.

జాతీయ పార్టీలకు అభ్యర్థులే గతి లేరు



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్ : జాతీయ పార్టీలకు కూడా ఎంపీ అభ్యర్థులకు గతి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రెండు పార్టీలకు అభ్యర్థులులేక బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులని తమ పార్టీలో చేర్చుకొని ఎంపీ టికెట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని కరువులో ముంచిందని, పాలనపై అవగాహన లేని నాయకులు రాజ్యమేలుతున్నారని విమర్శించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే హుజూర్‌నగర్ లో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని అన్నారు. హుజూర్‌నగర్‌కు ఇన్‌చార్జిగా తానే ఉంటానని ఎక్కువ సమయం కేటాయిస్తానని ఎవరూ అధైర్యపడవద్దని ఆయన చెప్పారు. ఇక్కడ పార్టీ కేడర్ చాలా బలంగా ఉందని, కొత్త నాయకులను తయారు చేద్దామని, శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బతీసేలా బీఆర్ఎస్‌కు పునర్ వైభవం వచ్చేలా ఓట్లు వేయించాలన్నారు. ఎంపీ బడుగలు లింగయ్య యాదవ్ , ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి మాట్లాడారు. సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.





నేత్రపర్వం.. శ్రీచక్రతీర్థం

యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్ల సేవ, ఆళ్వారుడిని చక్రతీర్థ స్నానం కోసం ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది

విష్ణు పుష్కరిణిలో ఆళ్వారుడికి చక్రతీర్థ స్నానం వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదాద్రిలో గవర్నర్



రాష్ట్ర నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బుధవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య


మహిళ మృతదేహం

బీబీనగర్: రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలో గల రైల్వే స్టేషన్ సమీపంలోని ఎగువ లైన్‌లో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 40సంవత్సరాలు కలిగి ఉన్న మహిళ బీబీనగర్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని రైలు కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు ఒంటిపై తెలుపు రంగు చీర, పసుపు పచ్చ జాకెట్ ధరించి ఉందని తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గడ్డి మందు తాగి బలవన్మరణం

వలిగొండ : గడ్డి మందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వలిగొండ మండలం ఎం.తుర్కపల్లిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎం.తుర్కపల్లి గ్రామానికి చెందిన సింగనబోయిన నర్సింహ (58) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. జీవితంపై విరక్తి చెందిన బుధవారం గ్రామ శివారులోని చెరువు సమీపంలో గడ్డి మందు తాగాడు. స్థానిక రైతులు గమనించేలోపే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోదాడ: అనుమతులు లేకుండా పాలేరు వాగు నుంచి కోదాడకు ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని ఓనర్లు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మంగళితండా గ్రామ శివారు నుంచి ఈ ఇసుకను తరలిస్తుండగా దోరకుంట వద్ద పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుర్రంపోడు : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు ఆమలూరు గ్రామంలో జరిగింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆమలూరు గ్రామానికి చెందిన వంగూరి నర్సింహ (52) బుధవారం ఇంటి ఆవరణలోని సంపు మోటారు నీరు పోయకపోవడంతో మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు.గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీ చక్రతీర్థం.. పుష్పయాగం

- బ్రహ్మోత్సవాల్లో నారసింహుడికి విశేష పూజలు
- ప్రథమ ప్రాకార మండపంలో మహా పూర్ణాహుతి
- రాత్రి వైభవంగా స్వామివారి దోపోత్సవం
- నేడు శతఘటాభిషేకంతో ముగియనున్న ఉత్సవాలు


మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం ఆలయంలో నిత్యారాధనలు, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణాలు నిర్వహించారు. 10.30 గంటలకు ఆలయ ఆచార్యులు, యాజ్ఞీకులు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. 10రోజుల పాటు ఉదయం, సాయంత్రం జరిగిన హోమాధి పూజలు, నిత్య పూర్ణాహుతిని ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల పరిసమాప్తి సూచకంగా మహా పూర్ణాహుతి వేడుక జరిపించారు. వేడుకలో ఆలయ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, యాజ్ఞీకులు, రుత్వికులు, ఆచార్యులు, అధికారులు, పాల్గొన్నారు.

శ్రీచక్ర ఆళ్వారుడితో..

మహావిష్ణువు ఆయుధమైన శ్రీచక్ర ఆళ్వారుడికి మధ్యాహ్నం 1గంటలకు విశేష పూజలు చేశారు. కొండపైన గల విష్ణు పుష్కరిణిలో శ్రీచక్రతీర్థ స్నానం చేయించారు. తొలుత ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను, శ్రీచక్ర ఆళ్వారునికి అలంకరించి పల్లకిపై అధిష్టింపజేసి పూజలు చేశారు. సుదర్శ నారసింహ అలంకారంతో ఆలయ మాఢ వీధుల్లో ఊరేగిస్తూ విష్ణు పుష్కరిణి వద్దకు సేవను తీసుకువచ్చారు. అనంతరం పుష్కరిణి మండపంలో ఆచార్యులు శ్రీచక్ర ఆళ్వారుడికి పూజలు నిర్వహించారు. వివిధ పుష్పాలు, కుంకుమ, పసుపు, సుగంధ్ర ద్రవ్యాలను పుష్కరిణి నీటిలో కలిపి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.శ్రీచక్ర ఆళ్వారుడికి శుద్ధమైన జలంలో స్నానం చేయించారు.


విష్ణు పుష్కరిణిలో స్నానం ఆచరిస్తున్న భక్తులు


స్వామి, అమ్మవారికి పుష్పయాగ పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు

సకల దేవతలకు ఉద్వాసన

నిత్యారాధనల అనంతరం సాయంత్రం దేవతల ఉద్వాసన, శ్రీపుష్పయాగం, దోపోత్సవం ఘనంగా నిర్వహించారు. మహోత్సవంలో తెలిసి, తెలియక జరిగిన సర్వ విధ దోషములను తొలగించుటకు ప్రాయశ్చిత్తంగా ఆచార్యులు ఈ పుష్పయాగం నిర్వహించారు. ఇక బ్రహ్మోత్సవాల్లో ఆయా మంత్రములతో ఆహ్వానించిన సర్వ దేవతలను మంత్రపూర్వకంగా ఉద్వాసన పలికారు. అనంతరం స్వామి వారికి ప్రీతికరమైన దోపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ఆలయంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం ఉదయం 10గంటలకు స్వామి వారి అష్టోత్తర శత ఘటాభిషేకం జరిపిస్తారు. రాత్రి 9గంటలకు స్వామి వారి శృంగార డోలోత్సవం నిర్వహించి ఉత్సవాలకు పరిసమాప్తి పలుకుతారు.



దేవతోద్వాసన పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు, స్వామి అమ్మవార్ల సేవ, శ్రీచక్ర ఆళ్వారుడిని విష్ణు పుష్కరిణి వద్దకు తీసుకెళ్తున్న అధికారులు, అర్చకులు

ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్ నారాయణపురం : పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంస్థాన్ నారాయణపురంలో బుధవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు సగం ఎంపీ స్థానాలను కేటాయించాలని కోరారు. సామాజిక న్యాయం, రాజకీయ సమానత్వం పాటిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలకు అధిక లోక్‌సభ స్థానాలు కేటాయించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 60శాతానికి పైగా ఉన్న బీసీలకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. బీసీలను రాజకీయంగా అణచివేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, నాయకులు వీరమల్ల కార్తీక్, గణం నరసింహ, వరికుప్పల మధు, లక్ష్మణ్, నరసింహ, నవీన్, సత్తమ్మ, శ్రీకాంత్, భరత్, శోభన్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకుఎంపిక


సంతోష్

కోదాడఅర్బన్ : మహారాష్ట్రలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే 70వ సీనియర్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు కోదాడ గోల్డెన్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారుడు సంతోష్ ఎంపికైనట్లు ఆ క్లబ్ వ్యవస్థాపకుడు, కబడ్డీ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నామా నర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్ ఎంపికకు సహకరించిన తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాసాని జ్ఞానేశ్వర్, జగదీష్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రామచంద్రగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీకి ఎంపిక చేడయం పట్ల సంతోష్ హర్షం వ్యక్తం చేశాడు. సీనియర్ కబడ్డీ క్రీడాకారులు రవీందర్‌రెడ్డి, రామసాని రమేష్, ఇమామ్, శివనాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, రమేష్‌బాబు, వెంకటరెడ్డి, నాగరాజు, తదితరులు సంతోష్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ధరణి ఆపరేటర్ మృతి

కేతేపల్లి: రోడ్డు ప్రమాదంలో ధరణి ఆపరేటర్ మృతిచెందాడు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల శివారులో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ పట్టణానికి చెందిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రైటర్ సింగరి రాములు కుమారుడు నరేష్(32) కేతేపల్లి తహసీల్దారు కార్యాలయంలో ధరణి కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కేతేపల్లిలో విధులకు హాజరైన నరేష్ తిరిగి సాయంత్రం బైక్‌పై నకిరేకల్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో ఇనుపాముల శివారులో ఉన్న బైపాస్ జంక్షన్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈప్రమాదంలో బైక్‌పై నుంచి కిందపడిన నరేష్‌పై నుంచి బస్సు వెనుక టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమ్తితం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాములు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివతేజ తెలిపారు.

అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు


ఇంటి పైన రేకుల మీద వేలాడుతున్న కారు

మర్రిగూడ : మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన లపంగి యశ్వంత్ బుధవారం కారులో నాంపల్లికి బయలుదేరాడు. మండలంలోని వట్టిపల్లి పరిధిలోని బట్లపల్లి గ్రామం వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి రోడ్డు వెంట ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో యశ్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనలో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమవగా ఇంటి పై కప్పు రేకులు దెబ్బతిన్నాయి.

తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్

గరిడేపల్లి : తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి పొందవచ్చని ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్ తెలిపారు. వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ సమేతి, వ్యవసాయ శాఖ ఆర్థిక సహాయంతో గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంపై ఏడు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తేనెటీగల పెంపకంతో ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందన్నారు. బ్యాంక్ పరంగా సబ్సిడీలు, లోన్స్ రైతులు, యువతకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్ నరేష్, మృత్తిక శాస్త్రవేత్త కిరణ్‌లు మాట్లాడుతూ ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం ఉద్దేశం తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంలో లాభాలు, కేవీకేలో జరిగే వివిధ శిక్షణ కార్యక్రమాల, ఉత్పత్తుల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి ఆదర్శ్, మాధురి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ కంటే అధికంగా తీసుకోవద్దు


తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కృష్ణ

సూర్యాపేట రూరల్ : నిత్యావసర వస్తువులపై ఎమ్మార్పీ కంటే అధికంగా డబ్బులు తీసుకుంటే చర్యలు తప్పవని జిల్లా తునికల కొలతల ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కృష్ణ హెచ్చరించారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం సమీపంలో ఉన్న సాయికృష్ణ రెస్టారెంట్‌లో కూల్‌డ్రింక్స్ స్టాల్స్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో వాటర్ బాటిల్స్‌పై రూ. 5, బిస్కెట్స్, హల్దీరామ్ ప్యాకెట్స్‌పై ఎమ్మార్పీ కంటే అధికంగా తీసుకుంటున్నారని తెలపడంతో కూల్‌డ్రింక్స్ షాపుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు.

హిజ్రాల బైండోవర్

తుంగతుర్తి: మూడు రోజుల క్రితం తుంగతుర్తిలో హిజ్రాలు రెండు వర్గాలుగా ఏర్పడి ఘర్షణ పడటంతో పోలీసులు జోక్యం చేసుకొని సుమోటో కేసు నమోదు చేశారు. బుధవారం 18 మంది హిజ్రాలను అరెస్టు చేసి తహసీల్దార్ రమణారెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ఏడుకొండలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపుష్పయాగంలో సీఎస్ శాంతికుమారి


పుష్పయాగ పూజ నిర్వహిస్తున్న సీఎస్ శాంతికుమారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పాల్గొన్నారు. ముఖ మండపంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సీఎస్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. అంతకుముందు ఆలయ ముఖ మండపాల్లో ఏర్పాటు చేసిన శ్రీస్వామి వారి అవతారలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. చీఫ్ సెక్రటరీ శాంతి కుమారికి ఆలయ అధికారులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం శివాలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎస్ శాంతి కుమారికి కలెక్టర్ హనుమంత్ కే జెండగే, రాచకొండ సీపీ తరుణ్ జోషి, ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి స్వాగతం పలికారు.

దేశ ఆర్థిక పరిపుష్టిలో చేనేత రంగం కీలకం

- మేజర్ జర్నల్ అజయ్‌కుమార్ సింగ్, ఐఏఎస్ మధురాణి టియోటియా కితాబు
- పోచంపల్లిని సందర్శించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీతో పాటు పలు దేశాల అధికారుల బృందం


రీలింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి : దేశ ఆర్థిక పరిపుష్టిలో చేనేత రంగం కీలకమని న్యూఢిల్లీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ మేజర్ జర్నల్ అజయ్‌కుమార్ సింగ్, ఐఏఎస్ అధికారిణి మధురాణి టియోటియా అన్నారు. బుధవారం నేషనల్ డిఫెన్స్ అకాడమీతో పాటు ఇంగ్లండ్, బ్రెజిల్, టాంజానియా, నేపాల్, మయన్మార్ దేశాలకు చెందిన 16మంది ఉన్నతాధికారుల బృందం పోచంపల్లిని సందర్శించారు. చేనేత సహకార సంఘం, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను పరిశీలించారు. ఇక్కత్ వస్త్రాల డిజైన్‌లను పరిశీలించి చేనేత కళాకారుల నైపుణ్యాలను అభినందించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో అంతర్జాతీయంగా పేర్గాంచిన పోచంపల్లి చేనేత ఇక్కత్ పరిశ్రమ ప్రధాన భూమిక పోషిస్తుందని కొనియాడారు. పరిశ్రమలు, ఫార్మా, ఎయిరో స్పేస్, ఇంజనీరింగ్ రంగాలు కూడా బలమైన ఆర్థిక రంగానికి పునాదులు వేశాయని అన్నారు. పోచంపల్లిలో విద్యావంతులైన యువకులు సాయిని భరత్, భాస్కర్ సాంప్రదాయ చేనేత వృత్తికి ఆధునిక సాంకేతికను జోడిస్తూ ఈ వృత్తిని మరో తరానికి అందిస్తున్న తీరును అభినందించారు. వివిధ రంగాల అధ్యయనం అనంతరం ఈ నెల 22న సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్, ఉన్నతాధికారులతో సమావేశమై తమ దృష్టికి వచ్చిన పలు అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పథకాల రూపకల్పనలో భాగస్వామ్యం

మేజర్ జర్నల్ ఏకే సింగ్ ఆధ్వర్యంలో ఎన్‌డీఏ అధికారుల బృందం దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పలు రంగాలను అధ్యయనం చేస్తున్నారని ప్రాజెక్ట్ నోడల్ ఆఫీసర్ వెంకట శేఖర్ చెప్పారు. తెలంగాణలో హ్యాండ్లూమ్, ఫార్మా, ఇంజనీరింగ్, టీ–హబ్, టాటా ఎయిరో స్పేస్ ను సందర్శించనున్నారని చెప్పారు. వీరి వెంట జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, తహసిల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, డీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను కిడ్నాప్ చేసేందుకు వచ్చాడని..

- పోలీసులకు ఒడిశా వాసి అప్పగింత
- విచారణలో కూలీ అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న అనాజిపురం వాసులు


ఒడిశా వాసితో మాట్లాడుతున్న పోలీసులు

మోత్కూరు : చిన్న పిల్లలను కిడ్నాప్ చేసేందుకు వచ్చాడని అనుమానించిన గ్రామస్తులు ఒడిశా వాసిని పోలీసులకు అప్పగించారు. విచారణలో అతడు రోడ్డు నిర్మాణ కూలీ అని తేలడంతో అంతా ఊపిరి పిల్చుకున్నారు. మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జాతీయ రహదారి నిర్మాణంలో పని చేసే కూలీ అనాజిపురం గ్రామంలో ఉదయం తిరుగుతుండగా జంగాల కాలనీ వద్ద కుక్కలు వెంబడించాయి. భయంతో అతడు పరుగు తీస్తుండగా కాలనీవాసులు పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చాడని కేకలు వేయగా కర్రలు పట్టుకొని వెంబడించారు. అతడు సమీపంలోని ఓ ఫామ్ హౌస్‌లోకి దూరాడు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కర్రలు పట్టుకుని ఫామ్‌హౌస్ చుట్టుముట్టారు. దాడి చేస్తారనే భయాందోళనతో ఫామ్‌హౌస్ లోపల ఉన్న అతడు ఇనుపరాడ్ చూపించి బెదిరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. కూలికి నమ్మకం కల్పించి అతనితో మాట్లాడి అదుపులోకి తీసుకున్నాడు. సదరు వ్యక్తిని విచారించగా ఒడిశా రాష్ట్రానికి చెందిన సహదేవ్ మఝీహ అని, రోడ్డు పనుల కోసం కాంట్రాక్టర్ అతడిని ఐదు రోజుల క్రితం ఇక్కడికి తీసుకువచ్చాడని తేలింది. మద్యానికి బానిసైన అతడు అనాజిపురం పరిసరాల్లో తిరిగాడని, కిడ్నాపర్ కాదని ఎస్ఐ చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సహదేవ్‌ను కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: ఉరేసుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడలోని శాంతినగర్‌కు చెందిన శ్రీనివాసరావు(43) సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో భాగంగా వర్క్ ఫ్రం హోం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్లుగా భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతుండగా పోలీస్ స్టేషన్‌లో కేసులు సైతం పెట్టుకున్నారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుందని తెలిసింది. ఈ క్రమంలో షేర్ మార్కెట్‌లో నష్టం రావడంతో అప్పులు ఎక్కువ అవగా.. శ్రీనివాసరావు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు, మరో వైపు కుటుంబ కలహాలు కోర్టు కేసులతో మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

గాయపడిన గీత కార్మికుడు మృతి


వెంకన్న(ఫైల్)

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రగాయాల పాలైదాస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతిచెందాడు. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన యరగాని వెంకన్న(54) ఈ నెల 16న రోజు మాదిరిగానే తాటిచెట్టు ఎక్కగా మోకు జారడంతో కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. అతడిని కుటుంబ సభ్యులు తొలుత సూర్యాపేట ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. కల్లు గీత కార్మిక సంఘం నాయకులు తుమ్మలపెన్‌పహాడ్‌లో వెంకన్న మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అబ్బగాని బిక్షం, తండు రమేష్, నోముల వెంకన్న,కాట్ల వెంకన్న, మామిడి లింగయ్య,యరగాని నారాయణ,ఉయ్యాల మల్సూర్,యరగాని శ్రీను ఉన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

గుండాల : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన గుండాల మండలంలోని మరిపడిగ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరిపడిగ గ్రామానికి చెందిన ఆటిపాముల రాములు వృత్తిరీత్యా టైలర్ (దర్జి) పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పనుల నిమిత్తం జనగామకు వెళ్లగా మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.1.20 లక్షలను నగదు ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన కొండబోయిన సత్తయ్య కుటుంబం ఉపాధి హామీ పనులకు వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.10 వేలను అపహరించుకపోయారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మోసానికి పాల్పడిన బ్యాంకు మేనేజర్‌పై కేసు

నూతనకల్ : మోసానికి పాల్పడిన బ్యాంక్ మేనేజర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నూతన్‌కల్ మండలం తాళ్లసింగారం ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌గా హరిప్రసాద్ గతంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లాడు. సూర్యాపేటలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో జరిగిన కుంభకోణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత బ్యాంక్ మేనేజర్ రవీందర్ బ్యాంక్ లావాదేవీలను పరిశీలించి లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. వాటిలో నకిలీ ధృవపత్రాలు సృష్టించి ఆధార్ సెంటర్ నిర్వాహకుడు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో కలిసి హరిప్రసాద్ సుమారు రూ. 2కోట్లు పక్కదారి పట్టించారని నిరూపణ కావడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బ్యాంక్ మేనేజర్ రవీందర్ ఫిర్యాదు మేరకు హరిప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.